క్లుప్తంగా

నేడు శివాలయంలో మండల పూజ

రామాపురం : మండలంలోని కసిరెడ్డిగారిపల్లె పంచాయతీ కడవకూటివాండ్లపల్లె సమీపంలో బండపై వెలసిన శివాలయంలో సోమవారం మండల పూజ నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలానే ఆలయంలో మహా గణపతి పూజ, పార్వతి, వినాయకుడు, ధ్వజ స్తంభం, నంది విగ్రహాలకు రుద్రాభిషేక పూజలు, శివపార్వతుల కల్యాణం, సాయంత్రం గ్రామోత్సవం, అన్నదాన కార్యక్రమం, పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు.

28న వారాంతపు సంత వేలం

సుండుపల్లె : మండల కేంద్రంలోని కూరగాయల సంత, పశువుల సంత వేలంపాట 2025 – 26 సంవత్సరానికి సంబంధించి ఈ నెల 28వ తేదీ శుక్రవారం రోజున నిర్వహిస్తున్నట్లు ఈఓపీఆర్‌డీ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు కూరగాయల మార్కెట్ వేలానికి రూ.70 వేలు, పశువుల సంత వేలానికి రూ.25 వేలను శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంటలోపు డిపాజిట్ లేదా నగదు రూపంలో గ్రామ పంచాయతీ కార్యదర్శికి చెల్లించి రసీదు తీసుకుని వేలంలో పాల్గొనాలని తెలిపారు. మధ్యాహ్నం 2:30 గంటలకు వేలం ప్రారంభించడం జరుగుతుందని, డిపాజిట్‌దారులు మాత్రమే వేలంలో పాల్గొనాలని ఇతరులకు ప్రవేశం లేదని ఆయన తెలియజేశారు.

కార్యకర్తకు కొరముట్ల పరామర్శ


కార్యకర్త రూపేష్‌తో మాట్లాడుతున్న కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజబోయిన రూపేష్ అనారోగ్యంతో ఉండి చికిత్స తీసుకొని విశ్రాంతి తీసుకుంటున్నాడన్న విషయం తెలుసుకొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డిలు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య విషయం తెలుసుకొని త్వరగా కోలుకోవాలని తెలియజేశారు. అన్ని వేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఈకార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

నల్ల గంగమ్మకు పూజలు



సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారికి పూజలు, అర్చనలు, అభిషేకాలు జరిపారు. ఆలయం ముందుభాగంలో బీజాక్షరాలతో వున్న మహిమ గల రాయిని భక్తులు మొక్కుకున్నారు.

సమాజ శ్రేయస్సే లక్ష్యం


సమావేశంలో పాల్గొన్న మానవతా సభ్యులు

చిట్వేలి : సమాజ శ్రేయస్సే లక్ష్యంగా మానవత సేవా సంస్థ పని చేస్తుందని అధ్యక్షులు కంబగిరి మునిరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ సాయి వికాస్ పాఠశాలలో ఆ సంస్థ నెలవారీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇటీవల విద్యుత్ ఘాతంతో గాయపడిన కార్తిక్ ఆరోగ్య పరిస్థితిపై సమీక్షించారు. దాతల ద్వారా వచ్చిన నగదును కుటుంబ సభ్యులకు అందించాలని తీర్మానించారు. అలాగే మానవత ద్వారా కొంత నగదును అందిస్తామని చెప్పారు.

అధికారులపై బురదజల్లడం మా నైజం కాదు

పీలేరు రూరల్ : ప్రభుత్వ అధికారులపై కులం పేరుతో బురదజల్లడం మాలమహానాడు నైజం కాదని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమ్మల ధరణికుమార్ అన్నారు. ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ భీమేశ్వర్‌రావు గౌరవప్రదమైన మండల మేజిస్ట్రేట్‌గా ఉండి రాజకీయ పార్టీలు, నాయకుల పట్ల అవహేళనగా మాట్లాడడం సబబు కాదన్నారు. ఈ నెల 18న స్థిరనివాసం పత్రం కోసం ఓ అర్జీదారునితో పాటు వెళ్లిన మాలమహానాడు నాయకుల పట్ల కనీస మర్యాద లేకుండా మాట్లాడారన్నారు. అధికారులు మా సంఘంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

ధరలను నిర్దేశిస్తూ.. ఉత్పత్తులను విక్రయిస్తూ..

- గిట్టుబాటు ధర లభించక, రవాణా ఛార్జీలు భరించలేకున్నామంటూ ఆవేదన
- పంట ఉత్పత్తులను జాతీయ రహదారిపై అమ్ముకుంటున్న రైతులు

రామాపురం : జాతీయ రహదారుల వద్ద రైతులు వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తులను విక్రయిస్తూ ఉపాధిని పొందుతున్నారు. ఇందుకు కడప – అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి 40వ నెంబరు జాతీయ రహదారి నెలవుగా చెప్పవచ్చు. రహదారికి ఇరువైపులా రామాపురం మండలానికి చెందిన పలు గ్రామాల రైతులు కూరగాయలు, పూలు, పండ్లు కొబ్బరి బొండాలను విక్రయిస్తూ వ్యాపారస్తులకు మారుతున్నారు. చిట్లూరు, బండపల్లె, కుమ్మరపల్లె, రామాపురం, కురవపల్లె, పాలన్నగారిపల్లె, టోల్‌ప్లాజా వద్ద టమాట, వంకాయ, బెండ, మటిక, బీర, కాకర, క్యారెట్, బీట్రూట్, క్యాబేజీ, ఉల్లగడ్డ, ఎర్రగడ్డలు, మునగ, అరటి, యాపిల్, దానిమ్మ, కమలా, జామ, సపోట, నేరుడు, కర్బూజ వంటి పండ్లు, పలు రకాల పూలు కడప, రాయచోటి కన్నా సరసమైన ధరలకు తాజా వస్తువులు లభించడంతో వాహనదారులు ఆగి వాటిని తీసుకెళ్తున్నారు. ఈ విషయంలో రైతులు రవాణా ఇతరత్రా ఖర్చులు మిగులుతుండటం, కొంత గిట్టుబాటు ధర గ్రేడింగ్ లేకుండా విక్రయాలు జరుగుతుండటం తమకు కొంతమేర ఉపశమనమిస్తోందని పలువురు విక్రయదారులు పేర్కొంటున్నారు. గతంలో ఇతర జిల్లాలకు, ఇతర రాష్ట్రాలకు సాగు చేసిన పంటలను రవాణా చేయడంలో రైతులకు భారంగా మారడంతో చేసేదేమీలేక పండించిన పంట ఉత్పత్తులను రహదారిపై విక్రయాలు చేస్తుండడం విశేషం.


జాతీయ రహదారిపై కూరగాయలను విక్రయిస్తున్న మహిళా రైతు


అనపకాయలను కొనుగోలు చేస్తున్న వాహనదారులు

గిట్టుబాటు ధర లేకపోవడమే



పంటలు పండించడటం, కూలీల ఖర్చు ఇతరత్రా వ్యవసాయ వంగడాలు ధరల విపరీతంగా పెరగడం, రైతులకు కొంత నిరాశజనకంగా మారింది. కష్టపడి పండించిన పంటకు లాభపాటి గిట్టుబడి లేకపోవడం తమ పంట పొలాల సమీపంలోని జాతీయ రహదారిపై విక్రయాలు అన్ని విధాలుగా మేలు చేకూరుస్తోంది. వ్యాపారం ఆశాజనకంగా ఉంటోంది. ధర దళారులు చెప్పినట్టు కాకుండా మార్కెట్ కంటే సరసమైన ధరలకు విక్రయిస్తున్నాం.

– మహబూబ్‌బాషా, రైతు, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా

రవాణా చార్జీలు పెరిగాయి



పంటలకు పెద్దగా ధరలు లేవు. వీటికి తోడు రవాణా చార్జీలు కూడా పెరిగాయి. దీంతో పండిన కూరగాయల పంటలను జాతీయ రహదారికి ఇరువైపుల గుడారాలు ఏర్పాటు చేసుకుని అక్కడే విక్రయాలు చేసుకుంటున్నాం. వివిధ రకాల కూరగాయలను ప్రజలకు అందేలా చూస్తూ లాభాలను చూస్తున్నాం. ప్రభుత్వాలు రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించకపోవడం ఆవేదనకు గురి చేస్తోంది.

– బాలక్రిష్ణారెడ్డి, బాలిరెడ్డిగారిపల్లె, రామాపురం మండలం, అన్నమయ్య జిల్లా

30న ఉగాది సంబరాలు

రాజంపేట టౌన్ : ఈనెల 30వ తేదీ ఉగాది పర్వదినాన పట్టణంలోని కాకతీయ విద్యాసంస్థల ఆవరణలో కళా కౌముది – కళా సంస్థ ఆధ్వర్యంలో ఉగాది సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సాయంత్రం 5 గంటలకు శశిధర్‌శర్మచే పంచాంగ శ్రవణం, అనంతరం ప్రముఖ దంతవైద్యులు డాక్టర్ నవీన్‌కు ఉగాది పురస్కారం ప్రదానం, 5:30 గంటలకు అరవ రమణయ్యచే ధార్మికోపన్యాసం, 6:30 గంటల నుంచి సరస్వతీ విద్యామందిరం పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, జాదూ రత్న యూపీ.రాయుడు ఇంద్రజాల ప్రదర్శన, ప్రముఖ కళాకారుడు, ఉపాధ్యాయుడు అయిన తుమ్మలపెంట వేణుగోపాల్ కళాకారుల బృందం వారి హాస్యవల్లరి కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఉగాది పురస్కారాల్లో పాల్గొనే ప్రజలకు పాలేటి రాధాకృష్ణారెడ్డి ప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

మువ్వల సందడి

కడప కల్చరల్ : ఎండలు తక్కువగా ఉండటంతో శిల్పారామంలో ఆదివారం సందర్శకుల తాకిడి కనిపించింది. ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రాచుర్యం పొందిన సినీ గీతాలకు ఉత్సాహంగా ప్రదర్శించిన నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. శిల్పారామం అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర


చెక్కభజన కార్యక్రమాన్ని తిలకిస్తున్న గ్రామస్తులు

సుండుపల్లె : మండల కేంద్రానికి సమీపంలోని బండకాడ ఈడిగపల్లెలో వెలసిన గంగమ్మ జాతర ఆదివారం ఉదయంతో ఘనంగా ముగిసింది. జాతరలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి రాత్రి చెక్కభజనలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ వెలుగులు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య బాణసంచా కాలుస్తూ చాందినీబండ్లు ఆలయం చుట్టూ చేసిన ప్రదక్షిణలు ఆకట్టుకున్నాయి. ఆదివారం ఉదయం భక్తులు బోనాల సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


జాతర ప్రాంగణానికి బయలుదేరుతున్న చాందినీబండ్లు

నిర్మాణ కార్మికులను విస్మరిస్తే తిరుగుబాటు

రాజంపేట రూరల్ : భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికలలో ఇచ్చిన హామీలను విస్మరిస్తే తిరుగుబాటు తప్పదని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంగాధర్, సాంబశివ, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాలి చంద్రలు కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానిక ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో ఆదివారం టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశాన్ని కార్యదర్శి జమాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు తక్షణమే కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టి సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా సంక్షేమ బోర్డుకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తన సొంత నిధులు కోటి రూపాయలు జమ చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 22 లక్షల మంది కార్డులు పొందిన కార్మికులు ఉన్నారని గుర్తు చేశారు.



మాట్లాడుతున్న ఏఐటీయూసీ గంగాధర్

అదే విధంగా కార్డులు పొందని కార్మికులు 30లక్షల మందికి పైగా ఉన్నట్లు తెలియజేశారు. బోర్డును పునరుద్ధరించటంతో పాటు పెండింగ్‌లో ఉన్న 40 వేల క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ఇ.సికిందర్, ఆటో డ్రైవర్స్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, నాయకులు సుబ్రమణ్యం, ముజఫర్, నరసింహులు, జమాల్, బాబు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

మాచుపల్లెలో వైభవంగా గంగమ్మ జాతర

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో ఆదివారం స్థానిక ప్రజలు గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. జాతర సందర్భంగా గంగమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారికి బోనాలు, కాయాకర్పూరం సమర్పించారు. మరికొందరు కోడిపుంజులు, మేక పోతులు బలిచ్చి మొక్కుబడులను చెల్లించుకున్నారు. అనంతరం జాతరకు విచ్చేసిన బంధువులు, స్నేహితులకు విందు భోజనాలను ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో సందడి వాతావరణం కనిపించింది.


గంగమ్మకు పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉపశమనం పొందేలా.. సేద తీరేలా!


స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న యువకులు

వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. వారం రోజుల నుంచి పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బేజారవుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు వివిధ మార్గాలను ఎంచుకుంటున్నారు. చల్లని పానియాలు తాగడంతో పాటు స్విమ్మింగ్ చేసేందుకు ఆసక్తిచూపుతున్నారు. పాఠశాల విద్యార్థులకు ఒంటి పూట బడులు కొనసాగుతుండటంతో చిన్నా.. పెద్దా అనే తేడా లేకుండా స్విమ్మింగ్ పూల్ బాట పడుతున్నారు. వ్యవసాయ బావుల్లో నీరు అడుగంటిపోవడంతో స్విమ్మింగ్ పూల్‌లను ఆశ్రయిస్తున్నారు. మండల కేంద్రంలోని గ్రామ శివారులోని కుశావతి నది (చిన్నేరు) తీరాన చిన్నారులతో స్విమ్మింగ్ పూల్ కళకళలాడింది. గాలివీడు, వెలిగల్లు తదితర గ్రామాల నుంచి ప్రజలు స్విమ్మింగ్ పూల్‌కు చేరుకొని ఈత కొడుతూ సేదతీరుతున్నారు. రూ.50 మాత్రమే వసూలు చేస్తుండటంతో ఇక్కడికి వచ్చేందుకు చిన్నారులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే మంచి అవకాశంగా భావించిన తల్లిదండ్రులు పిల్లలకు ఈత నేర్పిస్తున్నారు.

– గాలివీడు

యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

రాయచోటి అర్బన్ : యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకుని దేశభక్తి భావాలను పెంపొందించుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కోటేశ్వరరావు, జక్కల వెంకటేష్‌లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని దివ్యతేజ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్‌ల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహింపబడ్డాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసి చిన్నవయస్సులో బ్రిటీష్ వారిచేత ఉరి తీయబడ్డ మహనీయుడు భగత్‌సింగ్ అన్నారు. భగత్‌సింగ్‌తో పాటు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను సైతం దేశం కోసం వీర మరణం పొందారన్నారు. నేటి పాలకులు అలాంటి మహనీయుడి జీవితచరిత్రను పాఠ్యాంశం నుంచి తొలగించడం చాలా బాధాకరమన్నారు. నేటి యువత దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలంటూ కోరారు. సమసమాజం నిర్మాణం కోసం బాటలు వేసి లౌకికతత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో దివ్యతేజ హైస్కూల్ ప్రతినిధులు నాగేశ్వరరావు, శంకర్‌తో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళి

రాజంపేట టౌన్ : దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి వేడుకను ఆదివారం పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వరరావు, ఎస్ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలో వేర్వేరు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 23 సంవత్సరాల వయస్సులోనే బ్రిటీష్ పాలకుల నిరంకుశ పాలనకు చమరగీతం పాడేందుకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి పోరాడారన్నారు. చివరికి ఉరి కంభాన్ని ముద్దాడిన మహనీయులని కొనియాడారు. దేశం కోసం ప్రాణాలను అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. వారి త్యాగం విద్యార్థులు, యువతకు, ప్రజలకు తెలియాల్సిన అవసరం ఎంతైనావుందని చెప్పారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్‌ఐ నాయకులు వినోద్, వెంకట మహేందర్, రవి, హరి, షేక్షావలీ, అబ్రహం, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రాజంపేట టౌన్: భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థి నాయకులు


రాయచోటి అర్బన్: నివాళులర్పిస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నేతలు


లక్కిరెడ్డిపల్లి: మండల కేంద్రంలో సీపీఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ వర్ధంతి


పుల్లంపేట: భగత్ సింగ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు

పోరాట స్ఫూర్తితో దేశాన్ని రక్షించుకుందాం

లక్కిరెడ్డిపల్లి : బడా కార్పొరేట్ సంస్థల నుంచి దేశాన్ని కాపాడుకోవడమే కాక రాజ్యాంగ పరిరక్షణకు పోరాడుదామని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు అన్నారు. ఆదివారం సర్దార్ భగత్ సింగ్ 94వ వర్ధంతి సందర్భంగా లక్కిరెడ్డిపల్లి స్థానిక విశ్వ భారత్ స్కూల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు నానాటికి సంపన్నుల లాభాలు పెరిగిపోతున్నాయని, మరోవైపు ద్రవ్యోల్బణం పెరిగిపోతూ ఉద్యోగ అవకాశాలు, జీవన ప్రమాణాలు దిగజారిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం సర్దార్ భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చి ప్రతి జిల్లా కేంద్రంలో విగ్రహాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

భగత్ సింగ్‌కు ఘన నివాళి

పుల్లంపేట : మండల పరిధిలోని దళవాయిపల్లి గ్రామంలో ఆదివారం భగత్ సింగ్ 94వ వర్ధంతిని పురస్కరించుకొని భగత్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు రమణ మాట్లాడుతూ నరనరాన దేశభక్తిని నింపుకున్న భరతమాత ముద్దుబిడ్డ భగత్ సింగ్ అని కొనియాడారు. ఇంక్విలాబ్ జిందాబాద్ అని గర్జించిన వీర కిశోరం, భరతమాత దాస్య శృంఖలాలను తెంచడానికై చిరునవ్వుతో ఉరి కొయ్యను ముద్దాడిన స్వాతంత్ర్య వీరుడు భగత్ సింగ్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం


రోగులకు వైద్య సేవలు అందిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

ఓబులవారిపల్లె : గ్రామీణులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, వారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేర్కొన్నారు. ఆదివారం వైకోట గ్రామంలో తిరుపతికి చెందిన రష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో దాదాపు 300 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం రష్ హాస్పిటల్ అధినేత ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, వ్యాధి చిన్నదిగా ఉన్నప్పుడే చికిత్స చేయించుకుని ఆరోగ్యవంతులు కావాలని, వ్యాయామం, మంచి ఆహార నియమాలు పాటించి ఆరోగ్యకరమైన జీవితం గడపాలని కోరారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహణకు అన్ని విధాల సహకరించిన సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లెం ఈశ్వరయ్యను ఆయన శాలువాతో సత్కరించారు. వైద్యులు కిడ్నీ, గ్యాస్ ట్రబుల్, కడుపునొప్పి, అన్ని రకాల రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన సలహాలు, సూచనలు చేశారు.

ఉగాది పంచాంగం పంపిణీ

కడప కల్చరల్: నగరంలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో నగరానికి చెందిన పలువురు అర్చకులకు ఆదివారం ఉగాది పంచాంగాలు పంపిణీ చేశారు. జిల్లా అర్చక సంఘం అధ్యక్షుడు పిడతల గోపీశర్మ, ఏపీ పురోహిత సమాఖ్య గౌరవ అధ్యక్షుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, తదితరులు అర్చకులకు వాటిని అందజేశారు.

వివాహ రిసెప్షన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఆదిరాజు వేణుగోపాల్‌రాజు కుమారుడి వివాహ రిసెప్షన్‌లో ఆదివారం వైఎస్సార్‌సీపీ నాయకులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వేడుకకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, హేమనవర్మ తదితరులు హాజరయ్యారు.

పోలీసు సేవా పతక గ్రహీతకు సత్కారం

నందలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పోలీస్ శాఖ ద్వారా ఉగాది పురస్కారాల సందర్భంగా సేవా పతకానికి ఎంపికై నందుకు స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎస్ఐ మన్నెం రామమోహన్‌ను బచ్చు భవన్‌లో ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సభకు అధ్యక్షతన వహించిన విభా ఎరుడైట్ స్కూల్ చైర్మన్ డాక్టర్ జయభాస్కర్ రావు మాట్లాడుతూ ఎస్ఐ మన్నెం రామ్మోహన్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సేవా పతకం రావడం మనందరికీ గర్వకారణమన్నారు. అనంతరం నందలూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు దాసరి నరసింహులు మాట్లాడుతూ క్లిష్టమైన, తీరికలేని పోలీస్ శాఖలో ఉద్యోగం నిర్వర్తిస్తూ సేవా పతకం అందుకోవడం సంతోషదాయకమన్నారు. అనంతరం రామ్మోహన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కుద్రామణి యాదవ్, వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము, వాకర్స్ ఉప్పుశెట్టి సుధీర్, ఎంబలూరు ప్రదీప్ కుమార్, విజడమ్ స్కూల్ అధినేత సుధాకర్, గంధం గంగాధర్, మంటి మారయ్య, గండికోట కృష్ణ కుమార్, గుండు సురేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.


ఎస్ఐ రామ్మోహన్‌ను సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

ముగిసిన ఎన్‌పీటీఈఎల్ పరీక్షలు

కురబలకోట : ఎన్‌పీటీఈఎల్, మద్రాస్ ఐఐటీ స్వయం పరీక్షలు మండలంలోని మిట్స్ కళాశాలలో ఆదివారం ముగిశాయి. మూడు రోజులుగా జరుగుతున్న ఈపరీక్షలకు అధ్యాపకులు, విద్యార్థులు 3,734 మంది హాజరయ్యారు. ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్‌ను అందజేస్తారని ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు.